

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 175 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 26, మే 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

# వృద్ధుల బాధ్యత.. పిల్లలదే..!



● క్రమశిక్షణ లేని యువత కాలానికి భారం ● జన్మనిచ్చిన తల్లిదండ్రులను గోస పెడుతున్నారు ● తల్లిదండ్రులను విస్మరిస్తే సహించేది లేదు ● ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తున్న వృద్ధులకు రక్షణ లేకుండా పోతుంది ● స్వయంగా సీఎం హెచ్చరించిన తీరుమారని వృద్ధుల పిల్లలు ● పెను ప్రమాదంలో యువత జీవితాలు ● ఉద్యోగాల్లో చేరి తల్లిదండ్రులను మర్చిపోతున్నారు ● న్యాయస్థానాలు హెచ్చరించిన పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు ● దుబారా అలవాట్లలో మునిగి తేలుతున్న యువత ● వివాహాలు చేసుకుని ఆస్తులు రాయించుకుంటున్నారు ● వృద్ధాశ్రమాల్లో అనాధాశ్రమాల్లో చేర్పిస్తున్నారు ● కన్న తల్లిదండ్రులను భారంగా చూస్తున్న లెక్కలేనని కుటుంబాలు ● తల్లిదండ్రుల బాధ్యత భారం అనుకుంటున్న పిల్లలను శిక్షించాలి ● మద్యం మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్న యువత 70 శాతం పెరిగి పోయారు ● డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

పిల్లల భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులకు దిక్కులేకుండా పోతుందని డాక్టర్ బరిగెల శివ ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సమాజంలో కన్న తల్లిదండ్రులు పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును ఇవ్వడం కోసం ఎంతో ప్రయాస పడుతూ ఎంతో వేదనపడుతూ ఎంతో కష్టపడుతూ ఎంతో శ్రమ పడుతూ ఎన్నో రకాల మానసిక ఆర్థిక శారీరక దాడులను ఎదుర్కొని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడం కోసం సర్వాన్ని కోల్పోతున్నప్పటికిని బాధపడకుండా పిల్లల భవిష్యత్తును నిర్మించడం కోసం ఎంతగానో ప్రయాస పడుతున్న సందర్భాలు కోట్లల్లో కలవని వివరించారు. కన్న తల్లిదండ్రులను విస్మరిస్తున్న పిల్లలు కోట్లలో కలరని దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా వృద్ధులు కుటుంబాలకు భారంగా ఉంటున్నారని భావిస్తున్న పిల్లలే ఎక్కువ తయారవుతున్నారని తీవ్రంగా హెచ్చరించారు. తల్లిదండ్రుల రుణం

- మిగతా 2లో..





డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



## ప్లేట్‌లో ఆహారం కాదు.. యువత ఆరోగ్యాన్ని కబళిస్తున్న నెమ్మది విషం

ఫాస్ట్ ఫుడ్స్‌తో 20 ఏళ్లకే హైబీపీ ముప్పు

హైదరాబాద్ యువతపై తాజా అధ్యయనంలో షాకింగ్ నిజాలు

అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్‌తో గుండె జబ్బుల ప్రమాదం మూడు రెట్లు అధికం

కూల్ డ్రింక్స్, చిప్స్, బర్గర్లపై వైద్య నిపుణుల హెచ్చరిక

సంప్రదాయ ఆహారపు అలవాట్లకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచనలు

2





## కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

నేత్రదానంతో ఇద్దరికి వెలుగులు పంచిన భూక్యా సతీష్

బాధిత కుటుంబానికి అండగా నిలిచిన డాక్టర్ బరిగెల శివ..

ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని అధికారులకు విజ్ఞప్తి

3

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు టీజీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్..

కేంద్ర ఆర్డీఎస్ఎస్ పథకంలోకి తెలంగాణ!

7





## బాలిక హత్య కేసులో నిర్లక్ష్యం

ముగ్గురు ఐపీఎస్ అధికారులపై సీఎం విజయ్ కఠిన చర్య

కోయంబత్తూర్ ఘటనపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు

మీడియా సమావేశానికి ముందు నవ్వులు చిందించిన అధికారులు

వైరల్ వీడియోతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు

ప్రజల బాధ పట్ల స్పందన లేకపోతే ప్రజాసేవకు అర్హులు కారన్న సీఎం విజయ్

2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE | Jai Bheem

# బాలిక హత్య కేసులో నిర్లక్ష్యం

**ముగ్గురు ఐపీఎస్ అధికారులపై సీఎం విజయ్ కఠిన చర్య**
**కోయంబత్తూర్ ఘటనపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు**
**మీడియా సమావేశానికి ముందు నవ్వులు చిందించిన అధికారులు**
**వైరల్ వీడియోతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు**
**ప్రజల బాధ పట్ల స్పందన లేకపోతే ప్రజాసేవకు అర్హులు కారన్న సీఎం విజయ్**

**తమిళనాడు(జై భీమ్ టీవీ)**

తమిళనాడులోని కోయంబత్తూర్ జిల్లాలో 10 ఏళ్ల బాలికపై జరిగిన అమానుష ఘటన రాష్ట్రాన్ని, దేశాన్ని కలచివేసింది. బాలికను అపహరించి దారుణంగా హత్య చేసిన ఘటనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఈ ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు. అయితే కేసు పురోగతిని మీడియాకు వివరించేందుకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ముందు ఒక మహిళా ఐజీతో పాటు ఇద్దరు ఐపీఎస్ అధికారులు నవ్వుతూ, సరదాగా మాట్లాడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒక చిన్నారి ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన నేపథ్యంలో అధికారులు ఇలా వ్యవహరించడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఒక కుటుంబం కన్నీటిలో మునిగిపోయి ఉంటే, బాధ్యతాయుత పదవుల్లో ఉన్న అధికారులు నవ్వుతూ కనిపించడం మానవత్వానికి విరుద్ధం" అంటూ నెటిజన్లు మండిపడ్డారు. ముఖ్యంగా మహిళా అధికారిపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారం ముఖ్యమంత్రి విజయ్ దృష్టికి చేరడంతో ఆయన వెంటనే స్పందించినట్లు సమాచారం. ప్రజల పట్ల జవాబుదారీతనం, బాధితుల పట్ల సానుభూతి ప్రతి పోలీసు అధికారికి తప్పనిసరి అని స్పష్టం చేస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు ఐపీఎస్ అధికారులపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, "ప్రజల బాధను అర్థం చేసుకోలేని వారు ప్రజాసేవలో ఉండటానికి అర్హులు కారు. ఇలాంటి సున్నితమైన కేసుల్లో అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలి" అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు వ్యవస్థలో క్రమశిక్షణను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి విజయ్ తీసుకున్న ఈ నిర్ణయానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయి. "నేరస్తులపైనే కాదు, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపైనా చర్యలు తీసుకోవాలి" అనే సందేశాన్ని విజయ్ స్పష్టంగా ఇచ్చారని పలువురు అభిప్రాయపడుతున్నారు. సోషల్ మీడియాలో కూడా "ప్రజల భావోద్వేగాలను గౌరవించే నాయకత్వం ఇదే" అంటూ విజయ్ నిర్ణయాన్ని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**హన్మకొండ, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలుగు వెలుగు సాహితీ వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, చైర్మన్ పోలోజు రాజ్ కుమార్, జాతీయ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, కార్యనిర్వహణ అధ్యక్షులు కాసుల కిరణ్ కుమార్, వేముల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ స్ఫూర్తి నంది పురస్కారం, తెలంగాణ కీర్తి స్వర్ణ కంకణ పురస్కారం, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి పురస్కారం, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఉద్యమ పురస్కారం, కాళోజి సాహితీ సేవా పురస్కారం, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పురస్కారాలకు ఈ నెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, ఈవెంట్ ఆర్గనైజర్లు, యాంకర్లు, సాహితీవేత్తలు, రచయితలు, కవులు, కళాకారులు, సంగీత, నృత్య కళాకారులు, చిత్రలేఖనం, శిల్పం, జానపద కళలు, మిమిక్రీ, అవధానం, విద్య, వైద్య, సైన్స్ అండ్ టెక్నాలజీ, యోగా, కరాటే, వ్యవసాయం, సామాజిక సేవ, క్రీడలు, షార్ట్ ఫిలిం, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళా, యువజన సంఘాల ప్రతినిధులు తదితర వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పురస్కారాల ప్రధానోత్సవం జూన్ 14న హనుమకొండలోని టీఎన్జీవోస్ భవనంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9100174351, 9494400158 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## రౌడీ షీటర్లకు సుబేదారి పోలీసుల కౌన్సిలింగ్

**ఇన్స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ హెచ్చరిక**

**సుబేదారి, మే 25 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**





సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు నేర కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ సుబేదారి ఇన్స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకుని సమాజంలో బాధ్యతాయుతంగా జీవించాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలు, గొడవలు, బెదిరింపులు, భూకబ్జాలు, జూదం, మద్యం సంబంధిత నేరాలకు దూరంగా ఉండాలని ఆదేశించారు. ఎవరైనా నేరాలకు పాల్పడినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం సుబేదారి పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని తెలిపారు.

# వృద్ధుల బాధ్యత పిల్లలదే

మొదటి పేజీ తరువాయి



తీర్చుకోవాల్సిన పిల్లలు వివాహాలు చేసుకున్నాక కుటుంబ బాధ్యతలు అంటూ తల్లిదండ్రులను విస్మరించడమే కాకుండా వృద్ధాశ్రమాల్లో అనాధాశ్రమాల్లో చేరిపిస్తూ చేతులు దులుపుకుంటున్నారని తీవ్రంగా మండిపడ్డారు. పిల్లల అభివృద్ధి కోరిన తల్లిదండ్రులను తల్లిదండ్రుల మంచి చెడులు చూసుకోవలసిన వృద్ధాప్య సమయంలో కుటుంబ వ్యత్యాసాలను ముందేసుకుని ఆస్తుల తగాదాలను ముందేసుకుని తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తులు అన్నిటిని లెక్కలేసుకొని పంచుకుంటూ తల్లిదండ్రులకు చిల్లి గవ్వ కూడా ఉండనివ్వకుండా కొన్ని చోట్లనైతే రోడ్లపై వదిలేసి వెళ్లిపోతున్నారని చివాట్లు పెట్టారు. పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసే వ్యక్తులు తల్లిదండ్రులను ప్రత్యేకమైన శ్రద్ధలతో చూసుకుంటూ తల్లిదండ్రుల పోషణ కొరకు ప్రత్యేక కేర్ టేకర్లను ఏర్పాటు చేస్తూ తల్లిదండ్రుల సుఖసంతోషాలతో పాలుపంచుకుంటున్నారని అభినందించారు. మరికొన్నిచోట్ల తల్లిదండ్రులు భారమవుతున్నారని పిల్లలే కసాయిలుగా మారిపోయి ఎక్కడ ఏర్పడకుండా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు కుటుంబానికి భారం అని భావిస్తూ వాళ్ళను మానసికంగా వేధిస్తూ ఎప్పుడు మరణిస్తారా అని ఆత్రుతంగా ఎదురుచూసే దరిద్రపు ఆలోచనలకు దిగజారిపోతున్నారని తీవ్రంగా మందలించారు. మానవత్వపు విలువలకు కట్టుబడి ఉన్న కుటుంబ సభ్యులు కన్న పేగును కాపాడుకోవాల్సింది పోయి కసాయి వ్యక్తుల కన్నా హీనంగా ప్రవర్తిస్తున్నారని తీవ్రంగా మందలించారు. ఆస్తుల సంపాదనలో మునిగితేలుతూ కన్నతల్లి తండ్రులను మర్చిపోతున్న పిల్లలు లక్షల్లో కలరని అలాంటి వాళ్ళపై ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపడుతుందని గుర్తు చేశారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను విడమరుస్తున్న ఉద్యోగులపై అన్ని శాఖలు కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయగా దానిని బాధ్యతగా తీసుకున్న కొంతమంది ఉద్యోగులు తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకుంటున్నారని తెలిపారు. చాలాచోట్ల తల్లిదండ్రులపై తీవ్రమైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నది పిల్లలేనని గుర్తు చేశారు. ప్రస్తుతం సమాజంలో కొత్త రకమైన ట్రెండు నడుస్తుందని యువత మొత్తం మాదకద్రవ్యాల కోసం మద్యం కోసం డ్రగ్స్ కోసం గంజాయి కోసం డబ్బులు ఇవ్వని తల్లిదండ్రులపై దాడులు చేస్తున్నారని కొన్నిచోట్ల మద్యం మత్తులో హతమారుస్తున్నారని సంగతిని గుర్తు చేశారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎన్ని జన్మలెత్తిన రుణం తీర్చుకోలేమనే భావన ప్రతి కుటుంబంలో కలిగి ఉండాలి గాని కొంచెం ఎదగగానే జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరిచిపోయి మూర్ఖపు ఆలోచనలకు వస్తుండడం తీవ్రమైన అన్యాయం అని అలాంటి వాళ్లను కఠినంగా శిక్షించాలన్నారు. ఉద్యోగులుగా ఉంటూ వృద్ధాప్యంలో ఉంటున్న తల్లిదండ్రులను అనాధాశ్రమాల్లో వృద్ధాశ్రమాల్లో అప్పగిస్తున్న కుటుంబ సభ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా వృద్ధాశ్రమాలు పెరిగిపోవడానికి ప్రధాన కారణం ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులను వాళ్ళ వాళ్ళ పిల్లలు భారంగా భావిస్తున్నారని తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులదేనని తెలిసినప్పటికిని వృద్ధాప్యంలో ఉంటున్న కన్న తల్లిదండ్రులను భారంగానే చూస్తున్నారు తప్ప బాధ్యతగా చూడలేకపోతున్నారన్నారు. చిన్న నాటినుండి అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలు పెద్దవ్వగానే ఆస్తుల సంపాదనలతో అధికార హోదాలతో అహంకారం పెరిగి తల్లిదండ్రులను తీవ్రంగా విడమరుస్తున్నారని పూర్తిగా దూరం పెడుతున్నారని హెచ్చరించారు.

**విచ్చలవిడి జీవితాల్లో యువత..**

ప్రధాన నగరాల్లో రెచ్చిపోతున్న యువతను గమనిస్తుంటే పోలీసు అధికారులు ఎన్ని కఠినమైన చర్యలు చేపట్టిన యువత జీవితాల్లో మార్పులు రావడంలేదని విచ్చలవిడి దుబారా అలవాట్లకు బానిస అవుతున్న యువత సిటీ మొత్తంగా సాఫ్ట్వేర్ ఉద్యోగులమంటూ టూర్ల పేరు మీద వ్యభిచారాలకు పాల్పడుతున్నారని తీవ్రంగా హెచ్చరించారు. చదువుకుంటున్న యువత వరస వావి లేకుండా విచ్చలవిడిగా తిరుగుతూ సమాజాన్ని అవమాన పరుస్తున్నారని యువత జీవితాల్లో సంభవిస్తున్న పెనుమార్పుల వల్ల సమాజం తలవంపులు పడే పరిస్థితిలు ఎదురవుతున్నాయని తీవ్రంగా మందలించారు. చదువులకన్నా భవిష్యత్తు నిర్మాణం కన్నా అహ్లాదకరమైన ఆనందాలకు అల్ప సంతోషాలకు మత్తు పానీయాలకు ప్రేమ కార్యకలాపాలకు వ్యభిచారాలకు ఎక్కువగా అలవాటు పడుతూ దుబారా జీవితాలను అంటిపెట్టుకొని జీవిస్తున్న యువత పట్ల అప్రమత్తంగా ఉండాల్సింది తల్లిదండ్రులేనని హెచ్చరించారు. మధ్యరాత్రి వేళల్లో రోడ్లపై వాహనాల రైడింగ్ లంటూ సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్న యువత విచ్చలవిడిగా తిరగడాన్ని బట్టి సమాజమంతా పోలీస్ వ్యవస్థ యువతను నియంత్రించలేకపోతున్నారంటూ నిందలు వేసే ప్రయత్నాలు చేస్తున్నారని అలాంటి సందర్భాలను తీవ్రంగా ఖండిస్తూ అలాంటి విమర్శకులను పూర్తిగా వ్యతిరేకస్తూ పోలీసులు ప్రతి సందర్భంలో రాత్రి వేళల్లో రోడ్లపై తిరుగుతున్న యువత పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారని గుర్తు చేస్తూ మధ్య రాత్రి వేళల్లో పిల్లలు రోడ్లపై తిరగడాన్ని తల్లిదండ్రులు నియంత్రించలేకపోతున్నారని వాటి బాధ్యత అంతా తల్లిదండ్రులేనంటూ తీవ్రంగా హెచ్చరించారు. హాస్టల్స్ లో వసతులు ఏర్పాటు చేసుకుంటూ చదువుకుంటున్న యువత 80 శాతం ఓయో రూముల బాట పడుతున్నారని చిన్న పెద్ద భేదం లేకుండా జూనియర్ సీనియర్ అనే ఆలోచన లేకుండా మధ్యాన్ని అలవాటు పడుతూ మహిళలను యువతను కలవర పెడుతున్న యువకులు విచ్చలవిడిగా పెరిగిపోతున్నారని అదే సందర్భాల్లో యువతను చెడు మార్గాలు అనుసరించడానికి యువతులు కూడా ఎక్కువగా ప్రేరేపిస్తున్నట్లుగా సమాజంలో జరుగుతున్న రుగ్మతులను బట్టి అర్థమవుతుందన్నారు. కాయకష్టం చేసుకుని పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులు వాళ్ళ వాళ్ళ భవిష్యత్తు నిర్మాణాన్ని ముందస్తుగానే దృష్టిలో పెట్టుకొని పిల్లలు ఎదిగి మంచి ప్రయోజకులై వాళ్లను బాగుగా చూసుకుంటారేమోనన్న ఆశలతో పట్టణాల్లో చదివిస్తూ కావలసినంత ఫీజులను చెల్లిస్తూ ఖర్చులకు డబ్బులు ఇస్తూ ఎంతో కష్టపడి వాళ్ళ జీవితాలు నిలబడాలని ప్రయత్నాలు చేస్తుండగా వాటన్నిటిని పక్కన పెడుతూ తల్లిదండ్రుల ఆశలను తల్లిదండ్రుల ఆశయాలను తల్లిదండ్రుల విశ్వాసాలను ఏమాత్రం పట్టించుకోని యువత విచ్చలవిడి చెడుమార్గాలకు అలవాటు పడి సన్నాసుల కన్నా అధ్వానంగా తయారవుతున్నారని చివాట్లు పెట్టారు. మద్యం సేవించడంలో తెలుగు రాష్ట్రాలు దేశవ్యాప్తంగా ప్రథమ స్థానంలో ఉన్నాయంటే దానికి కారణం తల్లిదండ్రుల బాధ్యత అంటూ తల్లిదండ్రుల క్రమశిక్షణ పిల్లలపై సరిగా లేనందువలన యువత చెడు మార్గాలను ఎంచుకుంటున్నారని గుర్తు చేశారు.

**యువత గర్వం నాశనానికి నాంది..**

చాలా చోట్ల యువత గర్వంతో నడుస్తున్న తీరును ఎక్కువ చోట్ల గర్వాన్ని అడ్డుపెట్టుకొని జీవిస్తుండడం వల్ల జరిగే ప్రమాదాలను ఈ విధంగా వివరించారు. లక్షలు సంపాదిస్తున్నారనే గర్వం ఒకవైపు... తల్లిదండ్రుల నమ్మకాన్ని చంపేస్తున్న కొందరు పిల్లలు మరోవైపు..! సిటీల్లో ఉద్యోగాలు కాదు... అబద్ధాల సామ్రాజ్యాలు నడుపుతున్నారా..? పిల్లలు హైదరాబాద్‌లో, బెంగళూరులో, పుణేలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారని ఊరంతా గర్వంగా చెప్పుకుంటున్న తల్లిదండ్రులారా... మీ పిల్లలు ఎంత సంపాదిస్తున్నారన్నది కాదు, ఎలా జీవిస్తున్నారన్నది ఎప్పుడైనా ఆలోచించారా? కడుపు కోసుకుని చదివించిన తల్లిదండ్రులకు "పీజీలో ఉన్నాం", "హాస్టల్‌లో ఉన్నాం" అని చెప్పి... బయట మాత్రం సహజీవనం పేరుతో కాపురాలు పెడుతూ, రోజూ అబద్ధాలతో నమ్మకాన్ని ముక్కలు చేస్తున్న ఘటనలు సమాజంలో పెరుగుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. స్వేచ్ఛ అంటే బాధ్యతలేని జీవితం కాదు. ఆధునికత అంటే తల్లిదండ్రులను మోసం చేయడం కాదు. ప్రేమ అంటే అబద్ధాలపై నిలిచిన సంబంధం కాదు. కానీ నేడు కొందరు యువత "నా జీవితం -- నా ఇష్టం" అనే పేరుతో తమను నమ్మిన వారి హృదయాలనే గాయపరుస్తున్నారు. ఒకప్పుడు తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డారు. ఇప్పుడు కొందరు పిల్లలు తాత్కాలిక సుఖాల కోసం అదే తల్లిదండ్రుల నమ్మకాన్ని బలి పీఠంపై పెడుతున్నారు. జీతం లక్షలు వచ్చినా, నమ్మకం కోల్పోయిన జీవితానికి విలువ ఏమిటని పెద్దలు ప్రశ్నిస్తున్నారు. "తల్లిదండ్రులను మోసం చేసి సాధించిన స్వేచ్ఛ... స్వేచ్ఛ కాదు, బాధ్యత నుంచి పారిపోవడం." "కెరీర్ బిల్డ్ చేయడానికి వెళ్లి, క్యారెక్టర్‌ను కోల్పోతే ఆ విజయం వ్యర్థమే." "బ్యాంక్ అకౌంట్‌లో లక్షలు ఉండొచ్చు... కానీ తల్లిదండ్రుల కళ్లలో గౌరవం లేకపోతే ఆ సంపాదన శూన్యం." నగర జీవితం అవకాశాలను ఇస్తుంది. కానీ విలువలను అమ్ముకోవాలని ఎక్కడా చెప్పదు. స్వేచ్ఛను ఆస్వాదించండి, కానీ మిమ్మల్ని నమ్మి బతికే తల్లిదండ్రుల విశ్వాసాన్ని చంపేయొద్దు. ఎందుకంటే డబ్బుతో అన్నీ కొనొచ్చు... కానీ ఒకసారి కోల్పోయిన నమ్మకాన్ని మాత్రం తిరిగి కొనలేరు. యువత మార్పు సంభవించకుంటే సమాజం ఇంకా తీవ్రమైన ప్రమాదంలో పడిపోతుందని గుర్తు చేశారు.

# ప్లేట్‌లో ఆహారం కాదు.. నెమ్మదిగా చంపే విషం..!

**హైదరాబాద్ యువత ఆరోగ్యంతో ప్రమాదకర ఆట..**
**20 ఏళ్లకే హైబీపీ,గుండెపోటు ముప్పు..!**

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**




రుచి కోసం తింటున్న ఫాస్ట్ ఫుడ్స్, ప్యాకెట్ స్నాక్స్, కూల్ డ్రింక్స్ ఇప్పుడు యువత ప్రాణాలకే ముప్పుగా మారుతున్నాయి. హైదరాబాద్ నగర యువతపై నిర్వహించిన తాజా అధ్యయనం భయానక నిజాలను బయటపెట్టింది. నేటి తరం ఇష్టంగా తింటున్న పిజ్జాలు, బర్గర్లు, చిప్స్, చాక్లెట్లు, రంగురంగుల శీతల పానీయాలు కేవలం ఆకలి తీర్చే ఆహారం కాదని.. శరీరాన్ని నెమ్మదిగా నాశనం చేసే విషపదార్థాలుగా మారుతున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఐసీఎంఆర్ -- నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ నిర్వహించిన పరిశోధనలో 18 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సు గల కాలేజీ విద్యార్థులను పరీక్షించగా దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్‌ను అధికంగా తీసుకునే యువతలో అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం సాధారణ యువతతో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే.. పరిశీలించిన విద్యార్థుల్లో 12.5 శాతం మందికి ఇప్పటికే హైబీపీ ఉన్నట్లు గుర్తించారు. జీవితాన్ని ఆస్వాదించాల్సిన వయసులోనే మందులు వాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుండటం వైద్య నిపుణులను కలవరపెడుతోంది. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో గుండెపోటు, పక్షవాతం, కిడ్నీ వైఫల్యం వంటి ప్రాణాంతక వ్యాధులు చిన్న వయసులోనే దాడి చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో ఉండే అధిక ఉప్పు, కృత్రిమ రసాయనాలు, నిల్వ పదార్థాలు, హానికర కొవ్వులు శరీరంలోని రక్తనాళాలను దెబ్బతీసి గుండె ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి. నాలుకకు క్షణిక ఆనందం ఇచ్చే ఈ ఆహారాలు జీవితాంతం బాధలను మిగిల్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఒక్కసారి ఆలోచించండి... ఈరోజు మీ చేతిలో ఉన్న చిప్స్ ప్యాకెట్,మీ ముందున్న బర్గర్ లేదా కూల్ డ్రింక్ రేపటి రోజున మీ ఆరోగ్యాన్ని, మీ కుటుంబ సంతోషాన్ని దూరం చేసే ప్రమాదం ఉంది. ఫాస్ట్ ఫుడ్ వ్యసనానికి బానిస కాకుండా ఇంట్లో తయారైన సంప్రదాయ ఆహారాన్ని అలవాటు చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# కరెంట్ షాక్‌తో యువకుడి మృతి









## నేత్రదానంతో ఇద్దరికి వెలుగులు పంచిన భూక్యా సతీష్

### బాధిత కుటుంబానికి అండగా నిలిచిన డాక్టర్ బరిగెల శివ..

### ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని అధికారులకు విజ్ఞప్తి

**హైద్రాబాద్, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం సోమ్లా తండాకు చెందిన భూక్యా సతీష్ (25) ఆదివారం రాత్రి జరిగిన విషాద ఘటనలో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబానికి ఆధారంగా ఉన్న యువకుడు అకాల మరణం చెందడంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. సతీష్ మృతి వార్త తెలిసిన వెంటనే జై భీమ్ టీవీ చైర్మన్, సామాజిక కార్యకర్త డాక్టర్ బరిగెల శివ స్పందించి బాధిత కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. ఘటన జరిగిన రాత్రి నుంచే కుటుంబ సభ్యులను పరామర్శించిన డాక్టర్ బరిగెల శివ, వారికి ధైర్యం చెబుతూ అన్ని విధాలుగా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకుంటూ ఏసీపీ, సీఐ, ఎస్ఐ స్థాయి పోలీసు అధికారులతో మాట్లాడి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గాంధీ ఆసుపత్రికి చేరుకున్న ఆయన, వైద్యులతో మాట్లాడి పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయ్యే వరకు అక్కడే ఉండి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ సమయంలో సతీష్ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన సతీష్‌కు భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఒకరు కేవలం 11 నెలల పసిబిడ్డ కాగా, మరొకరు రెండున్నర సంవత్సరాల బాలుడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న సతీష్ మృతి చెందడంతో వారి కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. చిన్న వయసులోనే ఇద్దరు పిల్లలు తండ్రిని కోల్పోవడం అందరినీ కలచివేసింది. ఈ విషాద సమయంలో కూడా సతీష్ కుటుంబ సభ్యులు మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచే గొప్ప నిర్ణయం తీసుకున్నారు. డాక్టర్ బరిగెల శివ సమక్షంలో కుటుంబ సభ్యుల అంగీకారంతో సతీష్ నేత్రాలను హైదరాబాద్‌లోని ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. ఆసుపత్రి వైద్యులు నేత్రదాన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి, సతీష్ కళ్ల ద్వారా మరో ఇద్దరు వ్యక్తులు చూపు పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్రాణాలు కోల్పోయినా తన నేత్రాల ద్వారా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన సతీష్ సేవాభావాన్ని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ప్రసాద్ కంటి



ఆసుపత్రి సిబ్బంది నేత్రదానాన్ని అభినందిస్తూ కుటుంబ సభ్యులకు ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని అందజేశారు. డాక్టర్ బరిగెల శివ మాట్లాడుతూ, "బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునేలా అధికారులతో నిరంతరం మాట్లాడతాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రోళ ప్రవీణ్, సాయి, రవి, వెంకట్, మల్లేష్, వసంత్, నవీన్ తదితర బంధువులు, స్నేహితులు పాల్గొని బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# వడదెబ్బను నిర్లక్ష్యం చేయొద్దు - ఆరోగ్యమే మహాభాగ్యం

### ప్రజలకు, వైద్య సిబ్బందికి డాక్టర్ భరత్ గాదె సూచనలు

**హనుమకొండ జిల్లా/హసన్‌పర్తి, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ భరత్ గాదె వేసవికాలంలో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బలు, డీహైడ్రేషన్, అలసట, తలనొప్పి, చర్మ సంబంధిత సమస్యలు అధికమవుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిలో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకుండా ఉండటం మంచిది అని పేర్కొన్నారు. ప్రజలు రోజుకు తగినంత నీరు తాగాలని, శరీరంలో నీటి శాతం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మజ్జిగ, కొబ్బరి నీరు, ఓఆర్ఎస్, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. పుచ్చకాయ, దోసకాయ, ముసంబి వంటి నీటి శాతం అధికంగా ఉన్న పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వివరించారు. చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు వేసవిలో మరింత జాగ్రత్తగా ఉండాలి. వీరిపై వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటుంది అని డాక్టర్ భరత్ గాదె హెచ్చరించారు. బయటకు వెళ్లేటప్పుడు తలకు టోపీ లేదా గుడ్డ కప్పుకోవడం, తేలికపాటి పత్తి దుస్తులు ధరించడం, చెమట పట్టిన వెంటనే శరీరాన్ని శుభ్రం చేసుకోవడం వంటి అలవాట్లు పాటించాలని సూచించారు. ఆహారపు అలవాట్ల విషయంలో కూడా ఆయన పలు సూచనలు చేశారు. బయట ఫాస్ట్ ఫుడ్, అధిక మసాలా పదార్థాలు, పాత ఆహారం తీసుకోవడం తగ్గించాలని చెప్పారు. ఇంట్లో తయారుచేసిన తాజా ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పరిశుభ్రమైన నీటిని మాత్రమే తాగాలని, వీధి పానీయాలు, కలుషిత ఆహారాన్ని దూరంగా ఉంచాలని పేర్కొన్నారు. శరీరంలో నీరసం, తల తిరగడం, వాంతులు, అధిక జ్వరం, బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని



సూచించారు. నీరు తాగండి -- ఆరోగ్యాన్ని కాపాడండి, వడదెబ్బను నిర్లక్ష్యం చేయొద్దు అంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే వేసవికాలంలో వైద్య సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ భరత్ గాదె సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వడదెబ్బ లక్షణాలతో వచ్చే రోగులకు తక్షణ చికిత్స అందించేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వడదెబ్బ నివారణపై ప్రచారం చేయాలని చెప్పారు. చివరగా ఆరోగ్యమే మహాభాగ్యం. వేసవిలో సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే వడదెబ్బను నివారించవచ్చు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి అని హసన్‌పర్తి సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ భరత్ గాదె తెలిపారు.

# రెండు ఆసుపత్రులు విఫలమైన కేసు

### అత్యంత ప్రమాదకరమైన ఏయోర్టిక్ శస్త్రచికిత్స ద్వారా రోగి ప్రాణాలను కాపాడిన మెడికవర్ వైద్యులు




**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

మరో ఆసుపత్రిలో ఏయోర్టిక్ స్టెంట్ గ్రాఫ్టింగ్ చేయించుకున్న ఒక రోగికి, ఆ తర్వాత తీవ్రమైన ఇన్ఫెక్షన్ సోకడంతో, ప్రధాన రక్తనాళమైన ఏయోర్టా ప్రాణాంతక పరిస్థితికి చేరుకుంది. తీవ్రమైన నడుమునొప్పి మరియు ప్రాణాంతక సమస్యలతో రెండు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో చికిత్స పొందినప్పటికీ, శస్త్రచికిత్స చాలా ప్రమాదకరం కావడంతో పెద్దగా ఆశ లేదని వైద్యులు చెప్పారు. దీంతో, ఆ రోగి బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో ఉన్న మెడికవర్ ఆసుపత్రిని సందర్శించి సలహా కోరారు. సీనియర్ కార్డియాలజిస్ట్ మరియు కార్డియోవాస్కులర్ సైన్సెస్ డైరెక్టర్ అయిన డాక్టర్ నాగ శ్రీనివాస్ నేతృత్వంలోని నిపుణుల బృందం, రోగి పరిస్థితిని క్షుణ్ణంగా పరీక్షించి, సంక్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించాలని నిర్ణయించింది. వాస్కులర్ సర్జన్లు డాక్టర్ శ్రీరామ్ మరియు డాక్టర్ అరుణ్ రెడ్డి, కార్డియాక్ అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ పాటిల్, ఇంటెన్సివ్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ నిత్యతో కూడిన బహుళ-విభాగాల నిపుణుల బృందం, సంక్లిష్టమైన అబ్డామినల్ ఏయోర్టిక్ స్టెంట్ ఎక్స్‌ప్లాంటేషన్ మరియు ఏయోర్టిక్ రీకన్‌స్ట్రక్షన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. ఈ శస్త్రచికిత్సలో, గతంలో అమర్చిన, ఇన్‌ఫెక్షన్‌కు గురైన అబ్డామినల్ అయోర్టిక్ స్టెంట్ గ్రాఫ్ట్‌ను తొలగించి, దెబ్బతిన్న అయోర్టా భాగాన్ని పునర్నిర్మించారు. శరీరంలోని కీలక అవయవాలకు, కాళ్లకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళమైన అయోర్టాపై పునఃశస్త్రచికిత్స చేయడం అత్యంత సవాలుతో కూడుకున్నది మరియు దీనివల్ల రక్తస్రావం, అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. నిపుణుల బృందం అధునాతన ఇమేజింగ్ టెక్నాలజీ మరియు ప్రత్యేక వాస్కులర్ సర్జికల్ పద్ధతులను ఉపయోగించి శస్త్రచికిత్సను సురక్షితంగా పూర్తి చేసి, రక్త ప్రసరణను సాధారణ స్థితికి తీసుకువచ్చారు. శస్త్రచికిత్స తర్వాత రోగి బాగా కోలుకున్నారు మరియు ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. సంక్లిష్టమైన అయోర్టిక్ వ్యాధులకు సకాలంలో చికిత్స చేయకపోతే ప్రాణాంతకం కాగలవని నిపుణులు అంటున్నారు. అందువల్ల, ముందస్తు రోగ నిర్ధారణ మరియు ప్రత్యేక చికిత్స ఆవశ్యకతను తెలియజేశారు. మెడికవర్ ఆసుపత్రిలోని అత్యాధునిక కార్డియోవాస్కులర్ మరియు వాస్కులర్ సేవలు, అధిక ప్రమాదం ఉన్న అయోర్టిక్ సమస్యలను విజయవంతంగా నిర్వహించడంలో గణనీయమైన పురోగతిని సాధిస్తున్నాయని అన్నారు.

# 31వ డివిజన్‌లో డ్రైనేజీ సమస్యపై సిపిఎం నిరసన




**హన్మకొండ, 24 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ నగరంలోని 31వ డివిజన్ రాజు హోటల్ మెయిన్ కూడలిలో పేరుకుపోయిన డ్రైనేజీ, పారిశుధ్య సమస్యల వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని సిపిఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు మంద సంపత్ మాట్లాడుతూ, గ్రేటర్ వరంగల్ అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ నగరంలో డ్రైనేజీ, రోడ్ల సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయని విమర్శించారు. మురికివాడల్లో నివసించే పేద ప్రజలకు కనీస వసతులు కూడా కల్పించడం లేదని ఆరోపించారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులను అభివృద్ధి పనులకు వినియోగించడంలో కార్పొరేషన్ విఫలమైందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను పారదర్శకంగా వినియోగించి మురికివాడల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రతి డివిజన్‌లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బొల్లారం సంపత్, శివరాత్రి రాజు, గొలుసుల తిరుపతి, ఎండి హసీబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈసారి హైబ్రిడ్ విధానంలో టీడీపీ మహానాడు... గిన్నిస్ రికార్డు ఖాయం: పల్లా

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఈసారి తెలుగుదేశం పార్టీ నిర్వహించబోయే మహానాడు గిన్నిస్ రికార్డు సృష్టించనుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తొలిసారిగా హైబ్రిడ్ విధానంలో ఏకంగా 1,875 క్లస్టర్లలో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. మహిళామణులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించాలనే ప్రధాన లక్ష్యంతో ఈ మహానాడు జరగనుందని పల్లా స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో భవిష్యత్ నాయకులను గుర్తించి, వారిని ప్రోత్సహించడానికే ఈ క్లస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఇప్పటికే 1,875 క్లస్టర్లకు గానూ 1,851 క్లస్టర్లలో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. మహానాడు తొలిరోజు కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది.

# గర్భిణీలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, 25 మే 2026 (జై భీమ్ న్యూస్)**

గర్భిణీలు తమ ఆరోగ్యం, పుట్టబోయే శిశువు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ సత్య శారద సూచించారు. మహిళలు మరియు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో సమతుల ఆహారం కీలక పాత్ర పోషిస్తుందని ఆమె పేర్కొన్నారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో తొలి రోజు న్యూట్రిషన్ మిషన్ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫుడ్ క్యాంప్‌ను సందర్శించి వివిధ పోషకాహార ప్రదర్శనలను పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రోటీన్, విటమిన్లు అధికంగా ఉండే ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తయారు చేసి వాటి ఉపయోగాలను కలెక్టర్‌కు వివరించారు. స్థానికంగా లభించే ధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, మిల్లెట్స్‌తో తయారు చేసిన వంటకాలను పరిశీలించిన కలెక్టర్ వాటిని ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా లభించే ఆహార పదార్థాలతోనే ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న పోషకాహార అవగాహన కార్యక్రమాలు, వంటల పోటీలు, గర్భిణీల ఆరోగ్య పరీక్షలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గర్భిణీలు క్రమం తప్పకుండా హెమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత నివారణ కోసం ఐరన్ మాత్రలు తీసుకోవడంతో పాటు విటమిన్-సి అధికంగా ఉండే నిమ్మకాయ, ఉసిరి, కమలాఫలం వంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతిరోజూ ఆహారంలో మిల్లెట్స్, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు వంటి పోషకాహార పదార్థాలను భాగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. తల్లి ఆరోగ్యం బాగుంటేనే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తాడని పేర్కొన్నారు. పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలను తగ్గించడం ద్వారా మహిళలు, పిల్లల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ సిబ్బంది మరింత చురుకుగా పనిచేసి మహిళల్లో పోషకాహారంపై అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) గణేష్, డీఆర్ఓ విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి బి. రాజమణి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, మెప్మా డీఎంసీ రేణుక, ఇతర అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీలలో రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



**వరంగల్, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వరంగల్ పట్టణంలోని చింతల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలు, మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారదా దేవి హాజరై ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి మహిళ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధులు ముందుగానే గుర్తిస్తే తగిన చికిత్స తీసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. స్త్రీలలో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉండడం వల్ల అనేక రకాల వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి మహిళ తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే కుటుంబం ఆరోగ్యంగా, ఆర్థికంగా సమృద్ధిగా ఉంటుందని తెలిపారు. అలాగే ప్రతి మంగళవారం జిల్లాలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ క్లినిక్‌లకు వెళ్లి రక్తహీనత, సంక్రమిత మరియు అసంక్రమిత వ్యాధులు, ఊబకాయం, గర్భ సంబంధిత సమస్యలకు పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహా మేరకు చికిత్సలు పొందాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీడబ్ల్యూఓ వరంగల్, వైద్యాధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి
జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు




**ములుగు, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**

జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా కలెక్టర్ అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వేడుకలు జరిగే ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, కూర్చునే ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రత తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టాలని, అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అత్యవసర వైద్య సిబ్బంది, అంబులెన్స్ సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేసి వేడుకలు విజయవంతం అయ్యేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డీఎస్పీ కిశోర్, అన్ని శాఖల జిల్లా అధికారులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చేలా కీలక ఒప్పందం కుదిరింది. రూ.13,600 కోట్ల రుణాలను రీఫైనాన్స్ చేయడానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (×=ఖీజ) ముందుకు వచ్చింది. ఈ మేరకు ఢిల్లీలో ఇరు సంస్థల ఉన్నతాధికారులు అధికారికంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ మనోజ్‌కుమార్ దూబె, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సమక్షంలో ఈ డీల్ ఖరారైంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం రాబోయే 20 ఏళ్ల కాలపరిమితితో, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ రుణాన్ని చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. దీనివల్ల హైదరాబాద్ మెట్రోపై ఉన్న తక్షణ ఆర్థిక భారం తగ్గనుంది. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు కీలక విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులో 100 శాతం యాజమాన్య వాటా పూర్తిగా ప్రభుత్వానికే బదిలీ అయినట్లు స్పష్టం చేశారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. దేశ ఆర్థిక వృద్ధిలో హైదరాబాద్ నగరం కీలక ఇంజిన్‌లా మారుతోందని సీఎస్ పేర్కొన్నారు. మెట్రో రైలు కనెక్టివిటీని మరింత విస్తరించడం ద్వారా నగరంలో ట్రాఫిక్ రద్దీ చాలావరకు తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రీఫైనాన్స్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, హెచ్ఎంఆర్ఎల్ బృందాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## హనుమకొండ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విష్ణు వర్ధన్ రెడ్డి ఎంపిక





**హన్మకొండ, 25 మే 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డి. విష్ణు వర్ధన్ రెడ్డి ఎంపికయ్యారు. ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి ఎంపిక సమావేశాలు నిర్వహించబడ్డాయి. తెలంగాణ రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రామ్మోహన్ గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కైలాష్ యాదవ్ అబ్జర్వర్‌గా ఈ ఎన్నికలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి డి. విష్ణు వర్ధన్ రెడ్డి, కార్యదర్శిగా సిహెచ్. సూర్యరావు ఎంపికైనట్లు అధికారికంగా ప్రకటించారు. క్రీడల అభివృద్ధికి కృషి చేస్తూ జిల్లా స్థాయిలో నెట్‌బాల్ క్రీడను మరింత ప్రోత్సహించేందుకు కట్టుబడి పనిచేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సాప్ డైరెక్టర్ రాజనాల శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ లిల్లీ ఫ్లోరెన్స్, డీవైఎస్ఓ కార్యాలయ సిబ్బంది, క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి : కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

చాహత్ బాజ్ పాయి అధికారులకు సూచనలు

**హన్మకొండ, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజావాణి ద్వారా ప్రజలు అందించే అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ ఎన్. రవి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు మొత్తం 248 అర్జీలను కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు అందజేశారు. అర్జీలు స్వీకరించిన వెంటనే సంబంధిత శాఖ అధికారులను వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాథోడ్ రమేష్, శేషాద్రి, మేన శ్రీను, సత్యనారాయణరెడ్డి, జిల్లా అధికారులు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## పంట అవశేషాల దహనానికి చెక్

రైతుల్లో చైతన్యం కోసం మడికొండలో ప్రత్యేక ప్రచార రథం

అగ్ని ప్రమాదాలు, పర్యావరణ నష్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు




**మడికొండ, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా మడికొండ ప్రాంతంలో పంట అవశేషాల దహనాన్ని నివారించేందుకు పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలిపోయే అవశేషాలను తగులబెట్టడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఎక్కువగా ఉండటంతో రైతుల్లో చైతన్యం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా మడికొండ సిఐ పుల్యాల కిషన్ ప్రత్యేక ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ రథం గ్రామాల వారీగా తిరుగుతూ పంట అవశేషాల దహనం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరిస్తోంది. మైక్ ప్రచారం, కరపత్రాల పంపిణీ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పొలాల్లో మంటలు వేయడం వల్ల సమీపంలోని పంటలు, చెట్లు, విద్యుత్ తీగలు దగ్ధమయ్యే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. కొన్నిసార్లు మంటలు అదుపుతప్పి గ్రామాల వరకు వ్యాపించే అవకాశం ఉండటంతో పాటు ప్రాణ నష్టం కూడా సంభవించే ప్రమాదం ఉందని సిఐ పుల్యాల కిషన్ తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో పొడి వాతావరణం కారణంగా చిన్న మంటలు కూడా భారీ అగ్ని ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. పొగ కారణంగా గాలి కాలుష్యం పెరగడంతో పాటు భూమిలో ఉండే సూక్ష్మజీవులు నశించి నేల సారవంతత తగ్గిపోతుందని తెలిపారు. దీని ప్రభావం భవిష్యత్తులో పంట దిగుబడులపై పడే అవకాశం ఉందన్నారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా వాటిని సేంద్రియ ఎరువులుగా వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు. అవశేషాలను భూమిలో కలపడం ద్వారా నేలలో సేంద్రియ పదార్థాలు పెరిగి భూమి నాణ్యత మెరుగుపడుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. అలాగే పశువుల మేతగా, కంపోస్ట్ తయారీలో కూడా వాటిని ఉపయోగించుకోవచ్చని సూచించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలకు రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోందని అధికారులు తెలిపారు. పంట అవశేషాల దహనాన్ని పూర్తిగా నివారించేందుకు ప్రతి రైతు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా మరిన్ని గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు వెల్లడించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

**ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశం**

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్, 25 మే 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను పోలీస్ కమిషనర్‌కు స్వయంగా వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విన్న సీపీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేస్తూ బాధితుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించినప్పుడు పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసు ప్రధాన కార్యాలయంలో దాదాపు ఆరు ఫిర్యాదులు స్వీకరించినట్లు సీపీ తెలిపారు. అందిన ఫిర్యాదుల్లో కుటుంబ సమస్యలు, భార్యాభర్తల మధ్య వివాదాలు, కేసుల పురోగతి, భూ సమస్యలు తదితర అంశాలు ఉన్నాయని వెల్లడించారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ కోరారు. ఎలాంటి సమాచారం ఉన్నా 8712685257 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.

**యువ షూటర్‌ను అభినందించిన సీపీ**

ఇదే కార్యక్రమంలో కమలాపూర్ ప్రాంతానికి చెందిన యువ స్పోర్ట్స్ షూటర్ సంగెం తనిసిని పోలీస్ కమిషనర్ అభినందించారు. ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన తనిసి క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ నూతనంగా స్పోర్ట్స్ గన్ కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. గన్ వినియోగానికి అవసరమైన అనుమతుల విషయమై సంబంధిత అధికారులతో కలిసి ఆమె సోమవారం సీపీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా యువ షూటర్‌తో మాట్లాడిన సీపీ ఆమె సాధించిన విజయాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రానికి మరింత గుర్తింపు తీసుకురావచ్చని పేర్కొన్నారు.



## ఇరిగేషన్ శాఖలో అవినీతి బాగోతం.. డీఈ శ్రీకాంత్‌పై ఏసీబీ దాడులు

**హైద్రాబాద్, 25 మే 2026 (జై భీమ్ న్యూస్)**



అవినీతిపై ప్రభుత్వం కఠిన హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ కొందరు అధికారులు మాత్రం లంచాల వ్యవహారాలకు పాల్పడుతూ ఏసీబీ వలలో చిక్కుతున్నారు. తాజాగా జనగామ జిల్లా పాలకుర్తి ఇరిగేషన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డీఈ శ్రీకాంత్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సమాచారం ప్రకారం, ఓ కాంట్రాక్టర్ బిల్లుల క్లియరెన్స్‌కు సంబంధించిన సంతకాల కోసం డీఈ శ్రీకాంత్ రూ.50 వేల లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై పెద్దవంగర మండలం కన్వాయిగూడెం గ్రామానికి చెందిన బాధిత కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించారు. ఈ క్రమంలో హనుమకొండలోని భవానీనగర్‌లో ఉన్న తన నివాసంలో కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేల లంచం తీసుకుంటుండగా డీఈ శ్రీకాంత్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. ట్రాప్ అనంతరం అధికారులు శ్రీకాంత్‌పై ప్రాథమిక విచారణ చేపట్టారు. అనంతరం భవానీనగర్‌లోని ఆయన నివాసంలో సోదాలు నిర్వహిస్తూ నగదు, బ్యాంకు పత్రాలు, ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు మరియు ఇతర కీలక ఆధారాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇరిగేషన్ శాఖలో కాంట్రాక్టర్ల బిల్లుల క్లియరెన్స్, టెక్నికల్ అనుమతులు, పనుల కొలతలు, ఫైళ్ల ఆమోదాల్లో అవినీతి ఆరోపణలు తరచూ వినిపిస్తున్న నేపథ్యంలో ఈ ఘటనకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ప్రభుత్వ పనులు పూర్తి చేసిన తర్వాత కూడా బిల్లుల కోసం కాంట్రాక్టర్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్న విమర్శలు ఉన్నాయి. ఈ ఘటనతో హనుమకొండ జిల్లాలో కలకలం రేగగా, ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు అధికారిక ప్రకటన అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

జనసేన పార్టీలో తన పుష్కర కాలం నాటి సహనానికి స్వస్తి పలుకుతున్నానని, ఇకపై పార్టీలో క్రమశిక్షణ తప్పితే ఉపేక్షించేది లేదని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. పార్టీని ఒక సైనిక పటాలంలా ముందుకు నడిపించేందుకు కఠిన నిర్ణయాలు తప్పవని స్పష్టం చేశారు. రాజమండ్రిలో జరిగిన పార్లమెంటరీ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీలో ప్రక్షాళనకు శ్రీకారం చుడుతున్నట్లు సంచలన ప్రకటన చేశారు. దీనికి తొలి అడుగుగా, అంతర్గత కలహాలతో సతమతమవుతున్న ప్రకాశం జిల్లా జనసేన కార్యవర్గాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రకాశం జిల్లా కమిటీలో తీవ్రమైన వర్గ విభేదాలు ఉన్నాయని, కేవలం 25 మంది సభ్యుల మధ్య ఏకంగా 54 గొడవలు ఉన్నాయని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్గత కలహాలతో ఒకరినొకరు పనిచేయనివ్వకుండా పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలో ఇలాంటి క్రమశిక్షణారాహిత్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పార్టీలో అందరికీ స్వేచ్ఛ ఇచ్చానని, కానీ ఇకపై తాను అనుకున్న పద్ధతిలోనే పార్టీని ముందుకు నడిపిస్తానని తేల్చిచెప్పారు. "ఒకే మార్గంలో నడవండి, లేదంటే పక్కకు తప్పుకోండి (ఫాల్ ఇన్ లైన్ ఆర్ ఫాల్ అవుట్ ఆఫ్ లైన్)" అంటూ గట్టిగా హెచ్చరించారు. ఈ నిర్ణయం ద్వారా పార్టీలో ఏ స్థాయి నేతలైనా క్రమశిక్షణ తప్పితే కఠిన చర్యలు తప్పవనే బలమైన సందేశాన్ని పవన్ పంపించారు.

## నాగారం గ్రామంలో వివో భవనానికి శంకుస్థాపన

### మహిళా సంఘాలను వ్యాపార రంగంలో ముందుకు తీసుకెళ్తాం : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు







**హసన్‌పర్తి, 25 మే 2026 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండల పరిధిలోని నాగారం గ్రామంలో డీఆర్‌డీఓ ఏపీఎం దాసరి నారాయణ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వివో భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన నిర్వహించారు. గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలను అన్ని రంగాలలో ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక పురోగతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం, అర్హులైన వారికి రేషన్ కార్డులు అందించడం, మండల సమాఖ్యలకు ఆర్టీసీ బస్సులు మంజూరు చేయడం వంటి పథకాలు మహిళల అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. అదేవిధంగా మహిళా సంఘాలను చిన్న స్థాయి కార్యకలాపాలకే పరిమితం చేయకుండా పెద్ద వ్యాపార రంగాల్లో కూడా నిలదొక్కుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు వంటి అవకాశాలను మహిళా సంఘాలకు కల్పిస్తున్నామని, రాబోయే రోజుల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, సూపర్ మార్కెట్లు వంటి పెద్ద వ్యాపార సంస్థలు కూడా నిర్వహించే స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీడియో లైవ్ కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమానికి హాజరైన మహిళలు, గ్రామ ప్రజలకు ప్రదర్శించారు. సీఎం ప్రసంగంలోని అంశాలను ఎమ్మెల్యే వివరించి మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సందరాజు లావణ్య సంతోష్, ఉప సర్పంచ్ కోట వాసు, వార్డు సభ్యులు, ఎంపీడీవో సుమన వాణి, డీఈపీఆర్ శ్రీనివాస్, ఏఈపీఆర్ వెంకటేశ్వర్లు, సీసీ అనురాధ, వివోఏలు, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాజీపేట పోలీస్ స్టేషన్ నుంచి సీఐడీ హైదరాబాద్‌కు ఎస్ఐ లావణ్ బదిలీ



**కాజీపేట, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**

కాజీపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ లావణ్ బదిలీపై సీఐడీ హైదరాబాద్‌కు రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సహచర సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన కాలంలో ఎస్ఐ లావణ్ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ కేసుల దర్యాప్తులో చురుకుగా వ్యవహరించారని పలువురు పేర్కొన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసిన ఆయన సేవలను అధికారులు, సహచర సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా పోలీస్ ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ఎస్ఐ లావణ్ తన సేవా కాలంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారని కొనియాడారు. సీఐడీ హైదరాబాద్‌లో కూడా సమర్థవంతంగా పనిచేసి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నవీన్, శివ, యాదగిరి, శ్యామ్, ఏఎస్ఐలు శ్రీధర్, జోయల్, త్యాగరాజు, కానిస్టేబుళ్లు మోహన్, కమల్, రాజ్ కుమార్, కుమార్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొని ఎస్ఐ లావణ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నీది మిషన్ మోడ్ కాదు.. కమీషన్ మోడ్: రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు

**ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన హరీశ్ రావు**

**రోహిణి కార్తె వచ్చినా ధాన్యం ఇప్పటికీ కళ్లాల్లోనే ఉందని ఆవేదన**

**రైతుల సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందగించిందని, ఐకేపీ సెంటర్లలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన ఆయన, వరి ధాన్యాన్ని పరిశీలించి అక్కడి రైతుల సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆయన ఘాటు విమర్శలు చేశారు. రైతులకు సాగునీరు, కరెంట్, యూరియా అందించడం దగ్గరి నుంచి పండిన పంటను సేకరించే వరకు ప్రభుత్వం ప్రతి దశలోనూ పూర్తిగా ఫెయిల్ అయ్యిందని హరీశ్ రావు విమర్శించారు. రోహిణి కార్తె ప్రవేశించినా సరే, ఇప్పటికీ ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోవడం, రైతులు ఎండనక వాననక అరిగోస పడటం రాష్ట్ర చరిత్రలో ముందెన్నడూ చూడలేదన్నారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "మొన్నేమో 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటామని చెప్పి, ఇప్పుడు కేవలం 70 లక్షల మెట్రిక్ టన్నులే కొంటాం అనడం ఎంతవరకు సబబు? రాష్ట్రంలో కోటి మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తే.. మిగిలిన 30 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలి?" అని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం ఆపి, వారి మెడలు వంచైనా సరే ధాన్యం సేకరించాలని డిమాండ్ చేశారు. "తాలు పెడితే తోలు తీస్తా" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ క్షేత్రస్థాయిలో సిద్దిపేట నియోజకవర్గంలోనే క్వింటాల్‌కు ఏకంగా 5 కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని, ఈ జాప్యం వల్ల వరి కుప్పలపైనే గుండెలు బాదుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ధాన్యాన్ని 'మిషన్ మోడ్'లో కొంటున్నామనే సీఎం వ్యాఖ్యలను తిప్పికొడుతూ.. ఇది మిషన్ మోడ్ కాదు, పూర్తిగా 'కమీషన్ మోడ్' అని ఆరోపించారు. నిన్న జరిగిన కేబినెట్ మీటింగ్‌లో ధాన్యం కొనుగోలుపై స్పష్టమైన నిర్ణయం వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలిం దన్నారు. 45 రోజుల్లో రైతుబంధు నిధులు వేస్తామని దేవుడి మీద ఒట్టు వేసి, 60 రోజులు గడిచినా వేయకుండా మాట తప్పారని, రేవంత్ రెడ్డి కేవలం ఒక "పేపర్ టైగర్" మాత్రమేనని విమర్శించారు. ముఖ్యమంత్రి తన ఢిల్లీ ట్రిప్పులను పక్కనబెట్టి, కళ్లాల్లో ఉన్న వడ్లను తరలించడానికి లారీల ట్రిప్పులను పెంచాలని హితవు పలికారు. రాజకీయ విమర్శలు పక్కనబెట్టి రైతుల సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గాలు చూపాలని హరీశ్ రావు హెచ్చరించారు. ఒకటి రెండు రోజుల్లో కొనుగోళ్లలో మార్పు రాకపోతే, స్వయంగా తానే సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నాకు దిగుతానని స్పష్టం చేశారు. అలాగే వేలాది మంది రైతులతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్లను దిగ్బంధిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు.

## బీ అలర్ట్.. రోళ్లు పగిలే 'రోహిణి కార్తె' ప్రారంభం

**జూన్ 7 వరకు కొనసాగనున్న రోహిణి కార్తె**

**మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యధికంగా ఉండనున్న ఎండ ప్రభావం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలుగు పంచాంగం ప్రకారం నేటి (మే 25) నుంచి అత్యంత శక్తిమంతమైన 'రోహిణి కార్తె' ప్రారంభమైంది. జూన్ 7 వరకు కొనసాగే ఈ కాలంలో ఎండల తీవ్రత గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైద్య, వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన ఎండల వల్ల ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగి, వడగాలులు, ఉక్కపోత తీవ్రరూపం దాలుస్తాయి. ఈ కాలంలో శరీరంలోని నీటి శాతం వేగంగా తగ్గిపోయి డీహైడ్రేషన్, వడదెబ్బ, తీవ్ర అలసట వంటి ముప్పులు పొంచి ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ ప్రభావం అత్యధికంగా ఉంటుంది. కాబట్టి ఆ సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడం మంచిది. ఒకవేళ వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి. దాహం వేయకపోయినా తరచుగా మంచి నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, ఓఆర్ఎస్ (గ్లూ-గ్లూ) వంటి పానీయాలు తీసుకోవడం ద్వారా శరీరాన్ని చల్లగా ఉంచుకోవచ్చు. అలాగే పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం ఎక్కువ ఉన్న పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలి.

# ములుగు జిల్లాలో ఘనంగా అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



**ములుగు, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**

దేవగిరిపట్నంలో తెలంగాణ ప్రభుత్వ '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా దేవగిరిపట్నం-1 అంగన్‌వాడీ కేంద్రాన్ని గౌరవ ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ఘనంగా ప్రారంభించారు. జిల్లా సంక్షేమ అధికారిని ప్రేమలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి దేవగిరిపట్నం సర్పంచ్ విస్లవత్ పూలమ్మ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా అందించిన సానికొమ్ము రోషి రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వార్డు సభ్యుడు బాలాజీ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ములుగు ప్రాజెక్ట్ సీడీపీఓ కె. శిరీష, సెక్టార్ సూపర్వైజర్లు అనంతలక్ష్మి, రమాదేవి, కమరున్నీసాబేగం, సరస్వతి, జూనియర్ అసిస్టెంట్ సంపత్‌తో పాటు అంగన్‌వాడీ టీచర్లు వి. విజయలక్ష్మి, జి. కవిత, ఎల్. కవిత, ఆయా జే. రోజా కార్యక్రమంలో పాల్గొన్నారు. డిజిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామస్తులు, తల్లులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరై ఆనందం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల పౌష్టికాహారం, ఆరోగ్యం, ముందస్తు విద్యాభివృద్ధికి ఈ కొత్త అంగన్‌వాడీ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పరకాల ఆర్డీవో డీఎస్ వెంకన్న



**హన్మకొండ జిల్లా/పరకాల, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం పరకాల నూతన ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్ వెంకన్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీవో డీఎస్ వెంకన్న జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన బాధ్యతలు చేపట్టిన వెంకన్నకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అభినందనలు తెలియజేస్తూ, పరకాల నియోజకవర్గ ప్రజలకు సమర్థవంతమైన పరిపాలన అందించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరేలా కృషి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రెవెన్యూ పరిపాలనలో పారదర్శకత, ప్రజలకు సత్వర సేవలందించడం, భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించినట్లు సమాచారం. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో డీఎస్ వెంకన్న మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో పరకాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

# తెలంగాణలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం

**కూలిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు**

**హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం**

**ఘట్‌కేసర్‌లో వడగళ్ళ వర్షం**

**మార్కెట్ యార్డులు, ధాన్యం సేకరణ కేంద్రాల్లో తడిచిన ధాన్యం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. రాజధాని నగరంలోని వనస్థలిపురం, హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. జనగామ జిల్లా నర్మెట్ట మండలంలో భారీగా వచ్చిన ఈదురుగాలులకు ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఘట్‌కేసర్‌లో వడగళ్ల వర్షం కురిసింది. మెదక్, సూర్యాపేట జిల్లాల్లోనూ వర్షం కురవడంతో ఎండల తీవ్రతకు ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. మెదక్ పట్టణంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మెదక్ సహా పలు ప్రాంతాల్లో మార్కెట్ యార్డులు, ధాన్యం సేకరణ కేంద్రాల్లో బస్తాలు తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలి

**వన మహోత్సవం కార్యక్రమంపై జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**




**హన్మకొండ, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డీఎఫ్‌వో, అదనపు కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ వన మహోత్సవ కార్యక్రమంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాకు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 18 లక్షలకు పైగా మొక్కలు నాటే లక్ష్యం నిర్దేశించబడిందన్నారు. ముందస్తుగానే మొక్కలు నాటే ప్రాంతాలను ఎంపిక చేసి, గుంతలు తవ్వడం, ఫిట్టింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. డీఆర్‌డీఓ శాఖకు 6 లక్షల మొక్కలు నాటే లక్ష్యం కేటాయించబడిందని తెలిపారు. సంబంధిత శాఖలు తమకు కేటాయించిన లక్ష్యాన్ని చేరుకునే విధంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. మొక్కలు నాటిన అనంతరం జియో ట్యాగింగ్ తప్పనిసరిగా చేయాలని, మొక్కలు నాటే ప్రాంతాల వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందుగానే మొక్కలు నాటే ప్రాంతాలను ఎంపిక చేసి పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులకు తెలిపారు. ఆయా ప్రభుత్వ శాఖల వారీగా మొక్కల నాటే లక్ష్యంపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏ ప్రాంతంలో ఎన్ని మొక్కలు నాటనున్నారో త్వరితగతిన నివేదికలు అందజేయాలని సూచించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి శాఖ కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి అటవీ శాఖ అధికారి బి. నిఖిత మాట్లాడుతూ హనుమకొండ జిల్లాకు ఈ సంవత్సరం 18 లక్షల 17 వేల 400 మొక్కలు నాటే లక్ష్యం నిర్దేశించబడిందన్నారు. మొక్కలు నాటే ప్రాంతాలను ముందుగానే ఎంపిక చేసి, అక్కడ నాటాల్సిన మొక్కల సంఖ్యపై స్పష్టత ఉండాలని అధికారులకు సూచించారు. వన మహోత్సవం ప్రారంభం నాటికి నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాలు ప్రారంభమైన వెంటనే మొక్కలు నాటితే అవి బాగా పెరుగుతాయని పేర్కొన్నారు. రానున్న రెండేళ్లకు సంబంధించిన మొక్కల నాటే లక్ష్య వివరాలను కూడా ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు వెల్లడించారు. ఏ నర్సరీ నుంచి ఏ ప్రాంతానికి ఎన్ని మొక్కలు పంపిస్తున్నామనే వివరాలు సంబంధిత అధికారుల వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జిల్లాలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి, డీఆర్డీవో మేన శ్రీను, జడ్పీ సీఈవో శేషాద్రి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక నాకాబందీ నిర్వహించిన హనుమకొండ పోలీసులు





**సుబేదారి, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, హనుమకొండ ఏసీపీ పి. నరసింహారావు ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని ఖమ్మం రోడ్ బైపాస్ బ్రిడ్జి వద్ద ప్రత్యేక నాకాబందీ కార్యక్రమం నిర్వహించారు. ఈ తనిఖీ కార్యక్రమాన్ని సుబేదారి ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ తన సిబ్బందితో కలిసి చేపట్టారు. నగరంలో శాంతి భద్రతలను పరిరక్షించడం, నేరాలను నియంత్రించడం, అనుమానాస్పద కదలికలను అరికట్టడం లక్ష్యంగా ఈ ప్రత్యేక నాకాబందీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. నాకాబందీ సందర్భంగా వాహనాలను విస్తృతంగా తనిఖీ చేసిన పోలీసులు, వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని, సంబంధిత వాహనదారులపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అదేవిధంగా వాహనాల్లో ప్రయాణిస్తున్న అనుమానాస్పద వ్యక్తులను, వారి సామగ్రిని మరియు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రాత్రి వేళల్లో నగరంలో నేర కార్యకలాపాలను అరికట్టేందుకు ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు పేర్కొన్నారు. ప్రజలు తమ వాహనాలకు సంబంధించిన అన్ని అవసరమైన పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ తనిఖీల్లో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేరస్తుల ఆటకట్టే దిశగా పోలీసుల ప్రత్యేక నాకాబంది

**తనిఖీల్లో స్వయంగా పాల్గొన్న సీపీ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్, 25 మే 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**





నేరాల నియంత్రణతో పాటు పాత నేరస్తులను గుర్తించి శాంతిభద్రతలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చేపట్టిన ప్రత్యేక నాకాబంది తనిఖీలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. ఈ తనిఖీల్లో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ స్వయంగా పాల్గొని పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కాజీపేటలోని కడిపికొండ, భట్టుపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాలను పోలీస్ కమిషనర్ సందర్శించారు. అక్కడ పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తూ అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల వివరాలను పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, నంబర్ ప్లేట్లు, భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కూడా నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్‌లు, సీటుబెల్టు వినియోగించాలని సూచించారు. నాకాబంది తనిఖీల ద్వారా నేర కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించడం, చోరీ వాహనాలను పట్టుకోవడం, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం ప్రధాన ఉద్దేశ్యమని పోలీసులు తెలిపారు. నగరంలోని కీలక ప్రాంతాల్లో ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు.

# క్రైస్తవ హక్కుల రక్షణ సమితి ఆధ్వర్యంలో చేరికల సమావేశం

**సేవా పురస్కారాల ప్రదానం**



**హన్మకొండ, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**

క్రైస్తవ హక్కుల రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ డా. జన్ను యిర్మియా ఆదేశాల మేరకు, క్రైస్తవ హక్కుల రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుల్లా మదు ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా జ్యోతి బస్ నగర్ కాలనీ పెద్దమ్మ గడ్డలోని జీసస్ ఇన్ కల్వరి మినిస్ట్రీస్ చర్చి లో చేరికల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాకు నూతన కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను గుర్తించి సన్మానించారు. రెవ. కే. అశోక్ పాల్, సరిగొమ్ముల దీన్ దయాల్, రెవ. పి. విలియం కేరి, మాట్ల రాజు, రెవ. నిరీక్షణ, రెవ. సీయోను రాజు తదితరులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిషప్ డా. జన్ను యిర్మీయా, నేషనల్ చీఫ్ అడ్వైజర్ రెవ. కే. అశోక్ పాల్, వరంగల్ క్రిస్టియన్స్ సొసైటీ చైర్మన్ సరిగొమ్ముల దీన్ దయాల్, మాజీ కార్పొరేటర్ కాంగ్రెస్ నాయకులు బోడా డిన్నా, రెండు తెలుగు రాష్ట్రాల ఇంచార్జ్ రెవ. పి. విలియం కేరి, రెండు తెలుగు రాష్ట్రాల ఆర్గనైజింగ్ సెక్రటరీ కొడవటి రవి, నేషనల్ ఆర్గనైజర్ రెవ. కోట జాషువా, నేషనల్ ప్రచార కార్యదర్శి పాస్టర్ సిహెచ్ కృపాల్, పాస్టర్ నిరీక్షణ, పాస్టర్ సంతోష్, పాస్టర్ సీయోను రాజు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు పాస్టర్ సింగారపు రాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర కమిటీ నాయకులకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ "దేవునికి మహిమ కలుగును గాక" అని పేర్కొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రుల అక్రమాలపై కలెక్టర్, డీఎంహెచ్ఓ, డిప్యూటీ కలెక్టర్లకు ఫిర్యాదు

**చర్యలు తీసుకోకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరిక**

**కాంగ్రెస్ ఎంఆర్పీఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజా ఆరోగ్యం పరిరక్షణ సమితి**

**హన్మకొండ, మే 25 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో జరుగుతున్న అక్రమాలు, వైద్య నిబంధనల ఉల్లంఘనలు మరియు నిరుపేద రోగుల ఆర్థిక దోపిడీపై తక్షణ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ ఎంఆర్పీఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజా ఆరోగ్యం పరిరక్షణ సమితి, తెలంగాణ ప్రజా ఆరోగ్యం అక్రమ ఫీజు వసూళ్ల నిరోధక సమితి ప్రతినిధులు జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ, డిప్యూటీ కలెక్టర్లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు బొట్ల మహర్షి, బొట్ల సుధాకర్ మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రుల్లో అర్హత కలిగిన వైద్యుల పర్యవేక్షణ లేకుండానే శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా అపెండిసైటిస్, గర్భసంచి సమస్యలతో వచ్చే పేద రోగులకు కనీస అర్హతలు లేని ఓ.టి. అసిస్టెంట్స్ చేత ఆపరేషన్లు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కొన్ని ఆసుపత్రులు, అనుబంధ డయాగ్నోస్టిక్ సెంటర్లు అల్ట్రాసౌండ్ స్కాన్లు, ఇతర వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ నిరుపేద ప్రజలను ఆర్థికంగా దోచుకుంటున్నాయని ఆరోపించారు. ఈ అక్రమాలను ప్రశ్నించినందుకు తమను కుల వివక్షతో కూడిన అవమానకర



వ్యాఖ్యలతో దూషించారని నాయకులు తెలిపారు. సంబంధిత ఆసుపత్రులపై ప్రత్యేక తనిఖీ బృందాలతో సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోతే బాధితుల తరఫున "ఆమరణ నిరాహార దీక్ష" చేపడతామని హెచ్చరించారు.

# హెన్నూర్ లోని స్పర్శ్ హాస్పిటల్ ఒక సంవత్సరం పూర్తి చేసుకుంది

**ఉత్తర బెంగళూరులో సమగ్ర మల్టీస్పెషాలిటీ సంరక్షణకు పెరుగుతున్న అవసరాన్ని ఇది ప్రతిబింబిస్తుంది**

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

హెన్నూర్‌లోని స్పర్శ్ హాస్పిటల్ తన కార్యకలాపాలను ప్రారంభించి ఒక సంవత్సరం విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ ఆసుపత్రి యొక్క మొదటి సంవత్సరపు క్లినికల్ గణాంకాలు, ఉత్తర బెంగళూరులో ఆధునిక మరియు సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. కేవలం పన్నెండు నెలల్లోనే, ఈ ఆసుపత్రి 50,000కు పైగా ఓపీడీలు, 6,000కు పైగా ఆరోగ్య పరీక్షలు, 2,000కు పైగా శస్త్రచికిత్సలు, 1,000కు పైగా క్యాత్ ల్యాబ్ విధానాలు, 3,500కు పైగా డయాలసిస్ సెషన్‌లు మరియు 2,800కు పైగా సీటీ మరియు ఎంఆర్ఐ స్కాన్‌లను నమోదు చేసింది. ప్రజలు తమ ఇంటికి దగ్గరలోనే రోగ నిర్ధారణ మరియు చికిత్స పొందడానికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఇది చూపిస్తుంది. గత ఒక సంవత్సరంలో, హెన్నూర్‌లోని స్పర్శ్ హాస్పిటల్‌లో క్యాన్సర్, ఆర్థోపెడిక్స్, న్యూరో మరియు స్పైన్, యూరాలజీ మరియు జనరల్ సర్జరీ విభాగాలలో నిర్వహించిన శస్త్రచికిత్సల సంఖ్యలో స్థిరమైన పెరుగుదల కనిపించింది. ఈ ఆసుపత్రి 600కు పైగా రేడియేషన్ థెరపీ సెషన్‌లు, 800కు పైగా కీమోథెరపీ సెషన్‌లు, 120కు పైగా పిఇటి స్కాన్‌లు, 750కు పైగా ఎండోస్కోపీ విధానాలు మరియు 250కు పైగా డే కేర్ సర్జరీలను విజయవంతంగా నిర్వహించింది. ఇది ఒకే ఆసుపత్రి వ్యవస్థ కింద సమన్వయ సంరక్షణ అవసరాన్ని చెబుతోంది. ఆసుపత్రి మొదటి వార్షికోత్సవం సందర్భంగా, హెన్నూర్ రోడ్ మరియు యశ్వంత్‌పూర్‌లోని స్పర్శ్ హాస్పిటల్ క్లస్టర్ సిఒఒ కల్నల్ రాహుల్ తివారీ మాట్లాడుతూ "హెన్నూర్‌లోని స్పర్శ్ హాస్పిటల్ మొదటి సంవత్సరం, ఈశాన్య బెంగళూరు ఆరోగ్య సంరక్షణ అవసరాలు ఎంత వేగంగా మారుతున్నాయో మాకు చూపించింది. ఓపిడి, సర్జరీలు, డయాగ్నస్టిక్ సేవలు, డయాలసిస్, క్యాన్సర్ సంరక్షణ మరియు అత్యవసర చికిత్సలలోని రోగుల సంఖ్య, ఒకే సమన్వయ వ్యవస్థ కింద సాధారణ మరియు సంక్లిష్టమైన సంరక్షణను అందించగల ఆసుపత్రి అవసరాన్ని ప్రతిబింబిస్తోంది. రాబోయే రోజుల్లో, ఈ సమాజానికి మరియు చుట్టుపక్కల ప్రాంతాలకు సకాలంలో, కరుణతో కూడిన మరియు సులభంగా అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణను మరింత బలోపేతం చేయడంపై మా ప్రధాన దృష్టి ఉంటుంది." ఆసుపత్రి మొదటి సంవత్సర ప్రయాణంలో ఒక ప్రధాన భాగంగా, ఉత్తర బెంగళూరులో ప్రత్యేక క్యాన్సర్ సేవల అవసరాన్ని తీర్చడానికి అభివృద్ధి చేయబడిన స్పర్శ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ గణనీయమైన వృద్ధిని సాధించింది. రొమ్ము క్యాన్సర్, తల మరియు మెడ క్యాన్సర్, స్త్రీ జననేంద్రియ క్యాన్సర్లు, ఊపిరితిత్తుల క్యాన్సర్, మూత్ర సంబంధిత క్యాన్సర్, ఎముకల క్యాన్సర్ మరియు ఎముక మజ్జ మార్పిడి వంటి రంగాలలో సంరక్షణను అందిస్తూ, ఈ సంస్థ కచ్చితత్వం ఆధారిత, నియమనిబంధనల ఆధారిత మరియు వ్యాధి-నిర్దిష్ట క్యాన్సర్ సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

**స్పర్శ్ ఆసుపత్రుల గురించి**

స్పర్శ్ ఆసుపత్రి బెంగళూరు మరియు కర్ణాటకలోని ప్రముఖ మల్టీస్పెషాలిటీ ఆరోగ్య సంరక్షణ ప్రదాతలలో ఒకటి. ఇది నైతిక పద్ధతులు, వైద్య నైపుణ్యం, ఆవిష్కరణ మరియు సాంకేతికత ఆధారిత ఆరోగ్య సంరక్షణ అందించడంలో తన నిబద్ధతకు ప్రసిద్ధి చెందింది. 8 ఆసుపత్రులు మరియు 1,600కు పైగా పడకలతో, ఆర్థోపెడిక్స్, న్యూరోసైన్సెస్, కార్డియాలజీ, క్యాన్సర్ చికిత్స, నెఫ్రాలజీ, అత్యవసర సంరక్షణ, ట్రాన్స్‌ప్లాంటేషన్ సైన్సెస్ మరియు మహిళలు మరియు పిల్లల ఆరోగ్యం వంటి వివిధ ప్రత్యేకతలలో సంక్లిష్టమైన వైద్య పరిస్థితులను నిర్వహించడంలో స్పర్శ్ విశ్వసనీయతను కలిగి ఉంది. 3,400 మందికి పైగా ఉద్యోగులు మరియు 600 మందికి పైగా కన్సల్టెంట్ల మద్దతుతో, స్పర్ష్ 14 దేశాలకు పైగా ఉన్న రోగులకు సేవలందిస్తూ, 15 లక్షల మందికి పైగా ప్రజల జీవితాలను ప్రభావితం చేసింది. ఆధునిక మౌలిక సదుపాయాలు, రోబోటిక్ సర్జరీ, ఏఐ-ఆధారిత రోగ నిర్ధారణ మరియు అతి తక్కువ కోతతో చేసే శస్త్రచికిత్స నైపుణ్యంతో, స్పర్ష్ హాస్పిటల్ ప్రపంచ స్థాయి, రోగి-కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణను అందిస్తూ, కర్ణాటక మరియు ఇతర ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును పునర్నిర్వచిస్తోంది.



# విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి సమ్మర్ క్యాంపులు దోహదం

**జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్**

**హసన్‌పర్తిలో పాఠశాల, కేజీబీవీ సమ్మర్ క్యాంపుల ఘన ముగింపు**

**హన్మకొండ, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలో నిర్వహించిన పి.ఎం.శ్రీ జడ్‌పిహెచ్‌ఎస్ హసన్‌పర్తి పాఠశాల, కేజీబీవీ హసన్‌పర్తి 15 రోజుల సమ్మర్ క్యాంపులు ఆదివారం ఘనంగా ముగిశాయి. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన ఈ శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. పి.ఎం.శ్రీ జడ్‌పిహెచ్‌ఎస్ హసన్‌పర్తి పాఠశాలలో మే 11న ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి అధ్యక్షత వహించగా జిల్లా ఏఎంఓ డా. బండారు మన్మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ సృజనాత్మకత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకున్నారని వారు పేర్కొన్నారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ప్రత్యేక విద్యా వారోత్సవాల సందర్భంగా హసన్‌పర్తి కేజీబీవీలో మే 11 నుంచి మే 25 వరకు నిర్వహించిన సమ్మర్ క్యాంప్ కూడా విజయవంతంగా ముగిసింది. ఈ క్యాంప్‌లో హనుమకొండ పరిధిలోని 9 కేజీబీవీలకు చెందిన సుమారు 60 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. క్యాంప్‌లో స్పీడ్ మ్యాథ్స్, కంప్యూటర్ కోడింగ్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, కాలిగ్రఫీ, యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, డాన్స్ అండ్





మ్యూజిక్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. ముగింపు కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, హసన్‌పర్తి ఎంఈఓ ఎ. శ్రీనివాస్ రెడ్డి, జెండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్ ఎస్. సునీత, కేజీబీవీ ప్రత్యేక అధికారి డి. స్వప్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ మాట్లాడుతూ, సమ్మర్ క్యాంపులు విద్యార్థులలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాస అంశాల్లో కూడా చురుకుగా పాల్గొని తమ ప్రతిభను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. హసన్‌పర్తి ఎంఈఓ ఎ. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు సెలవులను సద్వినియోగం చేసుకుంటూ కొత్త విషయాలను నేర్చుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. జెండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్ ఎస్. సునీత మాట్లాడుతూ, విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సామాజిక అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రతి విద్యార్థిని తనలోని ప్రతిభను గుర్తించి ముందుకు సాగాలని సూచించారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి డి. స్వప్న మాట్లాడుతూ, 15 రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వివిధ రంగాల్లో తమ ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన అనేక అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించామని పేర్కొన్నారు. అనంతరం శిబిరాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టీఎన్జీవో ఆఫీస్ బేరర్లకు బదిలీల్లో మినహాయింపు ఇవ్వాలి : ఆకుల రాజేందర్




**హన్మకొండ, 25 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని టీఎన్జీవో యూనియన్ భవన్‌లో టీఎన్జీవో యూనియన్ కార్యవర్గ అత్యవసర సమావేశం జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో ఉద్యోగుల బదిలీల సందర్భంగా ఎదురవుతున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ, ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం నిషేధాన్ని సడలించిందని తెలిపారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన సంఘాల బాధ్యులకు బదిలీల్లో మినహాయింపు కల్పించే విధానం అమల్లో ఉందని, గతంలో కూడా గుర్తింపు సంఘమైన టీఎన్జీవోస్ యూనియన్ బాధ్యులకు మినహాయింపులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. టీఎన్జీవో యూనియన్ ఆఫీస్ బేరర్లకు కూడా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం బదిలీల్లో మినహాయింపు ఇవ్వాలని సంబంధిత జిల్లా అధికారులను కోరినట్లు తెలిపారు. కొంతమంది అసత్య ఆరోపణలు చేస్తూ అధికారులను తప్పుదోవ పట్టించి టీఎన్జీవో బాధ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బదిలీల్లో మినహాయింపు కోరిన ఆఫీస్ బేరర్లకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా మినహాయింపు కల్పించాల్సిందేనని ఆకుల రాజేందర్ స్పష్టం చేశారు. ఒకవేళ ఆఫీస్ బేరర్లను ఇబ్బందులకు గురి చేస్తే ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. జిల్లా అధికారులు ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేస్తూ టీఎన్జీవో ఆఫీస్ బేరర్లకు బదిలీల్లో మినహాయింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్యతో పాటు టీఎన్జీవో నేతలు లక్ష్మీప్రసాద్, సలీం, రాజమౌళి, రాజేష్ ఖన్నా, రాజేశ్వర్ రెడ్డి, రాజీవ్, అశోక్, వెంకన్న, శ్రీనివాస్, పృథ్వీ, పైడిరాజు, రఫీ, ప్రణీత్, నరేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు టీజీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్..

**కేంద్ర ఆర్డీఎస్ఎస్ పథకంలోకి తెలంగాణ!**

**గృహ, వాణిజ్య, పారిశ్రామిక కేటగిరీలన్నింటికీ దశలవారీగా స్మార్ట్ మీటర్లు**

**వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల నుంచి మినహాయింపు**

**మీటర్ల ఖర్చును భరించనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ విద్యుత్ రంగంలో ఒక కీలకమైన మార్పుకు రేవంత్‌రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఆర్డీఎస్ఎస్' (రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్) పథకంలో చేరేందుకు రాష్ట్ర కేబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయి. అయితే, రైతాంగానికి ఊరటనిస్తూ వ్యవసాయ కనెక్షన్లకు ఈ స్మార్ట్ మీటర్ల నుంచి పూర్తిగా మినహాయింపు ఇచ్చారు. మిగిలిన గృహ, వాణిజ్య, పారిశ్రామిక కేటగిరీలన్నింటికీ దశలవారీగా ఈ అధునాతన మీటర్లను అమర్చనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఈ పథకానికి సంబంధించి త్రైపాక్షిక ఒప్పందం జరిగినప్పటికీ, అప్పట్లో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. కానీ ప్రస్తుత ప్రభుత్వం డిస్కంల (విద్యుత్ పంపిణీ సంస్థల) నష్టాలను తగ్గించడం, పారదర్శక బిల్లింగ్ వ్యవస్థను తీసుకురావడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ స్మార్ట్ మీటర్ల కొనుగోలు, ఏర్పాటుకు అయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తాయని.. వినియోగదారులపై ఎలాంటి అదనపు భారం పడబోదని అధికారులు స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్ అనేది సాధారణ మీటర్ లాంటిది కాదు. ఇది ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (×శీ) సాంకేతికతతో పనిచేసే ఒక అధునాతన డిజిటల్ పరికరం. ఇది మీ ఇంట్లోని విద్యుత్ వినియోగ వివరాలను ఎప్పటికప్పుడు నేరుగా డిస్కంల సర్వర్లకు చేరవేస్తుంది. దీనివల్ల ప్రతి నెల మీటర్ రీడర్ మీ ఇంటికి రావాల్సిన అవసరం ఉండదు. మానవ తప్పిదాల వల్ల వచ్చే తప్పుడు, భారీ బిల్లుల ఇబ్బందులు వినియోగదారులకు తప్పుతాయి. వినియోగదారులు ఒక ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా తమ ఇంట్లో రోజువారీ విద్యుత్ వినియోగం ఎంత ఉందో ట్రాక్ చేసుకోవచ్చు. ఎక్కడ పవర్ వేస్ట్ అవుతుందో గమనించి నియంత్రించుకోవచ్చు. ఏ ప్రాంతంలో లోడ్ ఎక్కువగా ఉందో కచ్చితమైన డేటా దొరకడం వల్ల లో-వోల్టేజ్ సమస్యలు, అకస్మాత్తు విద్యుత్ అంతరాయాలు తగ్గుతాయి. అలాగే విద్యుత్ దొంగతనాలను, లైన్ లాసెస్ ను డిస్కంలు సులభంగా గుర్తించగలవు. ప్రస్తుతానికైతే ఈ స్మార్ట్ మీటర్లను మనం వాడుతున్న సాధారణ 'పోస్ట్‌పెయిడ్' (నెలంతా వాడాక బిల్లు కట్టే) విధానంలోనే అమలు చేయనున్నారు. అయితే భవిష్యత్తులో విద్యుత్ సంస్థల ఆర్థిక బకాయిలను అదుపు చేయడానికి, మొబైల్ రీచార్జ్ తరహాలోనే 'ప్రీపెయిడ్' (ముందుగా డబ్బులు రీచార్జ్ చేసుకుని విద్యుత్ వాడుకునే) విధానాన్ని కూడా తీసుకొచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆఫీసులు, స్థానిక సంస్థల విద్యుత్ వినియోగం కూడా ఈ డిజిటల్ నిఘా పరిధిలోకి రానుండటంతో బకాయిల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని నిపుణులు భావిస్తున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

# ప్లాస్టిక్ సర్జరీలపై అవికా గోర్ క్లారిటీ

శరీరంలో వచ్చిన మార్పులను తప్పుగా అర్థం చేసుకున్నారని వ్యాఖ్య
మొటిమల కోసం మాత్రమే చిన్న ట్రీట్‌మెంట్ తీసుకున్నానన్న అవికా
కాస్మోటిక్ సర్జరీలు చేయించుకోలేదని స్పష్టీకరణ
ఫిట్‌నెస్ కోసం కఠినమైన వర్కవుట్స్ చేస్తున్నానని వెల్లడి
స్టార్ హీరోయిన్లను చూసి ఇన్‌స్పైర్ అయ్యానన్న నటి



ఇటీవల 'అగ్లీ స్టోరీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన నటి Avika Gor ప్లాస్టిక్ సర్జరీలు, కాస్మోటిక్ ట్రీట్‌మెంట్లు చేయించుకుందంటూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారంపై స్పందించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, తనపై వస్తున్న రూమర్లకు క్లారిటీ ఇచ్చింది. తాను ఎలాంటి ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకోలేదని అవికా స్పష్టం చేసింది. "నా ముఖంపై ఒక చిన్న ట్రీట్‌మెంట్ తీసుకున్న మాట నిజమే. కానీ అది అందం కోసం కాదు.. కేవలం పింపుల్స్ తగ్గించుకోవడానికి మాత్రమే. దురదృష్టవశాత్తూ అది కూడా సరిగా పనిచేయలేదు" అని తెలిపింది. నటిగా స్క్రీన్‌పై ప్రెజెంటబుల్‌గా కనిపించడం కోసం అప్పుడప్పుడు పార్లర్‌కు వెళ్లి సాధారణ ఫేషియల్స్, బ్లడ్ సెల్స్ క్లీనింగ్ వంటి ట్రీట్‌మెంట్లు చేయించుకునేదాన్ని తప్ప ఎలాంటి కాస్మోటిక్ సర్జరీలు చేయించుకోలేదని వివరించింది. "నాకు చిన్నప్పటి నుంచే మేకప్ వేసుకోవడం అలవాటు. నా చర్మాన్ని కాపాడుకోవడానికి సన్‌స్క్రీన్ ఎక్కువగా వాడుతాను. ఒక చిన్న టాటూ వేయించుకోవాలన్నా, హెయిర్ కట్ చేయించుకోవాలన్నా మా అమ్మ అనుమతి కావాలి.. అలాంటిది పెద్ద సర్జరీలు ఎలా చేయించుకుంటాను?" అంటూ అవికా ఎదురు ప్రశ్నించింది. శరీరంలో వచ్చిన మార్పులు, ఫిట్‌నెస్ గురించి మాట్లాడుతూ.. "నా బాడీ టైప్ వల్ల చాలా త్వరగా బరువు పెరుగుతాను.. అలాగే తగ్గుతాను కూడా. వయసు పెరిగే కొద్దీ అమ్మాయిల శరీరంలో సహజంగానే మార్పులు వస్తాయి. కానీ చిన్నప్పటి నుంచి నన్ను చూస్తున్న వారు ఆ మార్పులను ప్లాస్టిక్ సర్జరీగా భావించారు" అని చెప్పింది. ఇండస్ట్రీలో ఘుఝిఙ్త్రు =బ్ష్ట ౚాఖుఎష్టబ, ఘుంవ్త్రఎఅఝి మీుఅఝుఅఋు, ౚాశీశీయు ఎవన్త్రఎవ వంటి హీరోయిన్ల ఫిట్‌నెస్ చూసి తాను ఎంతో ప్రేరణ పొందానని, వారిలాగే జిమ్‌లో కఠినమైన వర్కవుట్స్ చేస్తూ సహజంగానే బరువు తగ్గానని అవికా గోర్ తెలిపింది.




# 'జన నాయగన్' రిలీజ్‌పై జోరుగా ప్రచారం

జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సన్నాహాలు
విజయ్ పుట్టినరోజు కానుకగా ముందస్తు రిలీజ్ ప్లాన్
టికెటింగ్ యాప్స్‌లో కనిపించిన విడుదల తేదీ
'భగవంత్ కేసరి' రీమేక్‌గా కొనసాగుతున్న ప్రచారం
అధికారిక ప్రకటన కోసం అభిమానుల ఎదురుచూపులు

తమిళ అగ్ర నటుడు, ఇళయ దళపతి ఎఱయిఋం నటిస్తున్న 'జన నాయగన్' సినిమా విడుదలకు మార్గం సుగమమైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ సినిమా రిలీజ్‌కు ఉన్న అడ్డంకులు తొలగిపోయినట్లు తెలుస్తోంది. దీంతో ఈ సినిమా కొత్త విడుదల తేదీపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. జూన్ 22న విజయ్ పుట్టినరోజు ఉండటంతో అభిమానులకు కానుకగా మూడు రోజుల ముందే సినిమాను థియేటర్లలోకి తీసుకురావాలని భావిస్తున్నారట. ఇప్పటికే కొన్ని ఆన్‌లైన్ టికెటింగ్ యాప్స్‌లో 'జన నాయగన్' విడుదల తేదీగా జూన్ 19 కనిపించడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూరుస్తోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. ఈ సినిమా తెలుగులో దీష్టుుస్తుఋఝుత్ష్ట ఖవయిఖీఙ చిత్రానికి రీమేక్ అనే ప్రచారం కూడా జరుగుతోంది. హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ౚాశీశీయు ఎవన్త్రఎవ కథానాయికగా నటించగా, Mamitha Baiju కీలక పాత్రలో కనిపించనుంది. భారీ బడ్జెట్‌తో కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

# ట్విష శర్మ కేసులో కీలక మలుపు

రెండో పోస్టుమార్టం అనంతరం పూర్తైన అంత్యక్రియలు
కుటుంబ సభ్యుల డిమాండ్‌కు హైకోర్టు ఆమోదం
ఢిల్లీ ఎయిమ్స్ వైద్య బృందంతో మళ్లీ పరీక్షలు
రెండు వారాల తర్వాత నిర్వహించిన అంత్యక్రియలు
భర్త సమర్థ్ సింగ్ కోర్టులో లొంగిపోవడం చర్చనీయాంశం

నటి ఎఙఅంష్త్రు ౚాష్టుఖీఝి మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల డిమాండ్ మేరకు ట్విష మృతదేహానికి రెండోసారి పోస్టుమార్టం నిర్వహించగా, అనంతరం దాదాపు రెండు వారాల తర్వాత ఆమె అంత్యక్రియలు పూర్తయ్యాయి. మొదటి పోస్టుమార్టంపై అనుమానాలు వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులతో మళ్లీ పరీక్షలు నిర్వహించాలని పట్టుబట్టారు. దీంతో ఈ ప్రక్రియ కొంత ఆలస్యమైంది. ఈ వ్యవహారంలో మీుఎన్త్రుఝి ౚాఖుఎవంష్ట ఎఙఅన్త్రష్ట జశీబతీ జోక్యం చేసుకుని ట్విష కుటుంబ సభ్యుల డిమాండ్‌కు ఆమోదం తెలిపింది. భోపాల్‌లోనే ఢిల్లీ ఎయిమ్స్ వైద్య బృందంతో పోస్టుమార్టం నిర్వహించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం రాత్రి నలుగురు వైద్యుల బృందం భోపాల్ చేరుకుంది. అనంతరం ఆదివారం మధ్యాహ్నం భోపాల్ ఎయిమ్స్‌లో రెండో పోస్టుమార్టం పూర్తి చేసి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తర్వాత సాయంత్రం భద్భద విశ్రమ్ ఘాట్‌లో ట్విష శర్మ అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా, ఈ కేసులో ట్విష భర్త ఝుఝితీష్ట ౚాఙఅన్త్రష్ట కోర్టులో లొంగిపోవడం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.

# సినీ నటి రంభ కుటుంబంలో తీవ్ర విషాదం

రంభ తండ్రి వెంకటేశ్వరరావు కన్నుమూత
నువ్వు లేకుండా నేను లేను నాన్నా అంటూ రంభ భావోద్వేగం
మీరు లేని లోటును ఎవరూ భర్తీ చేయలేరన్న రంభ

ఒకప్పుడు దక్షిణాది సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలుగొందిన నటి రంభ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆమె తండ్రి వెంకటేశ్వరావు అనారోగ్య సమస్యలతో కన్నుమూశారు. రంభ సినిమా రంగంలో స్టార్ హీరోయిన్‌గా ఎదగడంలో, ఆమె ప్రయాణంలో తండ్రి వెంకటేశ్వరావు అత్యంత కీలక పాత్ర పోషించి, అండగా నిలిచారు. తండ్రి మృతిపై రంభ సోషల్ మీడియా ద్వారా తీవ్ర భావోద్వేగంతో స్పందిస్తూ.. "నువ్వు లేకుండా నేను లేను నాన్నా. నా జీవితంలో నువ్వు నింపిన శూన్యాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. నిన్ను ఎప్పటికీ మిస్ అవుతూనే ఉంటాను" అంటూ తన బాధను వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ కష్టకాలంలో ఆమె కుటుంబానికి ధైర్యం కలగాలని ఆకాంక్షిస్తూ పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సంతాపం ప్రకటిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న రంభ.. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటున్నారు. ఇప్పటికీ ఆమెకు ఫ్యాన్ ఫాలోయింగ్ తగ్గలేదు.

